క్లుప్తంగా

మాయ మాటలు నమ్మి మోసపోవద్దు

పుల్లలచెరువు: గ్రామాల్లో అపరిచత వ్యక్తులు ప్రవేశించి ప్రజలకు మాయ మాటలు చెప్పి నగదు దొంగలిస్తారని, అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్‌ఐ సంతప్ కుమార్ హెచ్చరించారు. ఈ నెల 17వ తేదీన మండలంలోని సిద్ధనపాలెంలో ఇద్దరు కషాయ వస్త్రాలు ధరించి గ్రామానికి చెందిన సోమేపల్లి హేమలత, ముక్కంటి అనే ఇద్దరి వద్దకు వచ్చి జాతకాలు చెబుతామని, చీడపీడలను తొలగిస్తామని, సంతానం లేని వారికి సంతానం కలిగేలా పూజలు చేస్తామని మాయ మాటలు చెప్పి వారి నుంచి రూ.65 వేలు తీసుకెళ్లారని పేర్కొన్నారు. 18వ తేదీన హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గడిచిన 24 గంటల్లో ఇద్దరి మోసగాళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.60 వేల నగదు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ అపరిచత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, ఫోన్ కాల్స్ కూడా రిసీవ్ చేయకూడదన్నారు. ఎవరిపైనైనా అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్ రావు హెచ్చరించారు. మండలంలోని పలు దుకాణాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, ఎరువుల రకాలు వాటి అమ్మకాల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. తేడాలు ఉంటే నోటీసులు ఇచ్చి సీజ్ చేస్తామని హెచ్చరించారు. పంటల సీజన్ చివరి దశకు వచ్చిందని, మండలంలోని పశువుల మేత పెంపకం 365 రోజులు ఉంటుందని, యూరియా అధిక మొత్తంలో అవసరం ఉంటుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో 107.7 మెట్రిక్ టన్నుల యూరియా ఇండెంట్ పెట్టామని, ప్రస్తుతం 13 టన్నులు లక్కవరం వచ్చిందని తెలిపారు. వితలాపురం, తురకపాలెం, నాగం బొట్లపాలెం, తాళ్లూరు-1 ఆర్బీకేల్లో వీఏఏలు పదోన్నతులపై వేరే మండలాలు వెళ్లినందున సిబ్బంది కొరత ఏర్పడిందని చెప్పారు.

బకాయిలపై దృష్టి సారించండి



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసరావు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని మార్రెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను విద్యుత్ శాఖ దర్శి డివిజన్ ఈఈ పి.శ్రీనివాసులు శనివారం సందర్శించారు. రికార్డులు, సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ విద్యుత్ మొండి బకాయిలపై దృష్టి సారించాలన్నారు. మొండి బకాయిలు ఉన్న సర్వీసులను తొలగించాలని ఆదేశించారు. వేసవి కాలం సమీపిస్తున్నందున అధిక లోడుపై జాగ్రత్తగా ఉండాలన్నారు. విద్యుత్ పెండింగ్ బకాయిలను వసూలు చేయాలన్నారు. విద్యుత్ లైన్లో తీగలు కిందకు వేలాడుతుంటే వాటిని సరిచేయాలన్నారు. విద్యుత్ సమస్యలుంటే ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. లైన్‌మెన్ పీవీ ఆంజనేయులు, జేఎల్‌ఎం మల్లికార్జున, షిఫ్ట్ ఆపరేటర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా శ్రీశైల ముఖద్వారం ఆర్చి

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మించిన ముఖద్వారం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రంగు రంగుల విద్యుద్దీపాలతో పాటు ముఖద్వారానికి నూతనంగా వేసిన రంగులతో నిత్యం శ్రీశైలం వెళ్లే యాత్రికులను అలరిస్తోంది. ఫిబ్రవరి 19వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు శ్రీశైలం పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో నిర్మించిన శివసదనం అతిథి గృహాన్ని సైతం అందంగా అలంకరించారు. శివసదనంలో యాత్రికులకు కావాల్సిన వసతి సౌకర్యాలు మెరుగుపర్చారు. శ్రీశైలం తరలి వెళ్లే భక్తులు, యాత్రికులు మండల కేంద్రం నుంచి ప్రయాణించాల్సి రావడంతో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ముందుగానే తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

తిరుమలనాథస్వామికి విశేష పూజలు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్య లక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామి ఆలయంలో భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్‌స్వామి, అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట ఉన్న శ్రీచక్రం వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

రైళ్లు ఆగక ప్రయాణికుల అవస్థలు

- దొనకొండలో రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి
- డీఆర్ఎం, జీఎంను కలిసినా ఫలితం శూన్యం
- ప్రయాణికుల ఆందోళన



దొనకొండ రైల్వేస్టేషన్

దొనకొండ: దొనకొండ రైల్వేస్టేషన్‌లో రాత్రి వేళ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్‌ను అమృత భారత్ కింద రూ.18 కోట్లతో అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇంత ఆర్భాటంగా ఉన్న రైల్వేస్టేషన్‌లో రాత్రి వేళల్లో రైలు బండ్లు ఆగక పోవటం ఏమిటని ప్రయాణికులకు ప్రశ్నార్థకంగా మారింది. 2019 ముందు ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు దొనకొండ స్టేషన్‌లో ఆగేది. 2019 తర్వాత కరోనా రావటం, ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెంటనే నిలిపివేయటం, ఆ తర్వాత ఆర్డినరీ రైళ్లను కూడా చిన్నగా నిలిపేశారు. ప్రస్తుతం ప్రయాణికులు నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, నంద్యాల, డోన్, గుంతకల్, బెంగళూరు, సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. 2022 తర్వాత కరోనా అదుపులోకి వచ్చి రైలు బండ్లను తిరిగి పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు దొనకొండలో నిలపకుండా మార్కాపురంలో మాత్రమే నిలిపేవారు. దూర ప్రాంతాలకు వెళ్లి పనులు పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణంలో ప్రయాణికులు దొనకొండలో రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిటీష్ కాలం నుంచి దొనకొండ స్టేషన్‌కు చరిత్ర ఉందని రైల్వే ఉన్నతాధికారులు చెప్పేవారు. 1940 నుంచి మీటర్ గేజ్ ఇటు నంద్యాల, అటు గుంటూరుకు ఉండేది. ఆ సమయంలో 16 రైళ్లు గుంటూరు నుంచి హుబ్లీ వరకు తిరిగేవి. 1990 నుంచి మీటర్ గేజ్ లైన్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో 18 ఎక్స్‌ప్రెస్, ఆర్డినరి రైళ్లు తిరిగాయి. విశాఖపట్నం నుంచి హుబ్లీ, బెంగళూరు వైపు ప్రశాంతి, కొండవీడు, గరీబ్‌రథ్, అమరావతి, సత్యసాయి నిలయం ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. అంతేకాకుండా విజయవాడ-హుబ్లీ, భువనేశ్వర్-బెంగళూరు, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్ రైళ్లు నడిచేవి. చుట్టుపక్కల దర్శి, పొదిలి, కొనకనమిట్ల, కురిచేడు, యర్రగొండపాలెం మండలాలకు చెందిన ప్రయాణికులు ఎక్కువ భాగం దొనకొండ నుంచి రైళ్లల్లో ఇతర ప్రాంతాలకు నిత్యం వెళ్లి వచ్చేవారు. దొనకొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపక పోవడంతో ప్రయాణికుల అగచాట్లు చెప్పేవి కాదు. రైల్వే ఉద్యోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నోసార్లు దొనకొండ పర్యటనకు వచ్చిన డీఆర్ఎం రామకృష్ణకు రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ప్రజలు దొనకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని వినతి పత్రాలు అందజేశారు. 1925లో దొనకొండలో లోకో షెడ్ ఉండటంతో సుమారు 1000 మంది రైల్వే కార్మికులు పని చేసేవారు. 70 స్టీమ్ ఇంజిన్లు నడిపేవారు. దొనకొండలో రైల్వే హాస్పటల్ ఉండటంతో గిద్దలూరు, నరసరావుపేట నుంచి రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు హాస్పటల్‌కు వచ్చేవారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు ఈ ప్రాంత ప్రజలను దృష్టిలో ఉంచుకుని రాత్రి వేళల్లో దొనకొండ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రైల్వే పనిపై విజయవాడ, విశాఖపట్నం వెళ్లి రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రావాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. దొనకొండలో రైళ్లు ఆగకపోవటం, మార్కాపురం వెళ్లి తిరిగి దొనకొండ రావాలంటే వ్యయ ప్రయాసలతో కూడుకుంది. ప్రతి నిత్యం పింఛనర్స్ నంద్యాల, గుంటూరు వెళ్తుంటారు. రైల్వే ఉన్నతాధికారులు రాత్రి వేళల్లో రైళ్లు నిలపాలి.

– **జాన్‌రాజ్**, విశ్రాంత రైల్వే ఉద్యోగుల సమైఖ్య కార్యదర్శి, దొనకొండ

వారానికి రెండు సార్లు దూర ప్రాంతాలకు వెళ్లాలి



ఇతర పనులపై వారానికి రెండు సార్లు గుంటూరు, విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. కరోనా సమయంలో ఆపిన ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలి. చాలా మంది వ్యాపారం, హాస్పటల్ కోసం విజయవాడ వెళ్తుంటారు. మరి ముఖ్యంగా విద్యార్థులు విజయవాడ నుంచి సెలవులకు రావాలంటే ఇబ్బందిగా ఉంటుంది.

– **మల్లెల రామిరెడ్డి**, విశ్వభారతి కరస్పాండెంట్, దొనకొండ


నిత్యం గుంటూరు వెళ్తుంటారు



మా కూతురు గుంటూరు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతోంది. ప్రతీ ఆదివారం దొనకొండకు రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రావాలంటే వీలు పడటం లేదు. మార్కాపురంలో దిగి ఆటో తీసుకుని దొనకొండకు రావాల్సి వస్తోంది. నేను నిత్యం గుంటూరు, విజయవాడకు సొంత పనిపై వెళ్లి వస్తుంటా. రైల్వే అధికారులు వేసవి నుంచైనా రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలి.

– **చిరుపల్లి అంజయ్య**, దొనకొండ

వైద్యానికి దూరం వెళ్లాల్సి వస్తోంది



సొంత పనిపై విజయవాడకు వెళ్లి వస్తుంటా. గతంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు దొనకొండలో నిలుపుదల చేసేవారు. దొనకొండకు ఒక ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. గతంలో రాత్రి వేళల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేశారు. ఎన్నోసార్లు డీఆర్ఎం రామకృష్ణను కలిశాం. రైల్వే ఉన్నతాధికారులు స్పందించాలి.

– **షేక్ మూసామియా (సర్దార్)**, దొనకొండ

గంజాయి నిందితుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు (కురిచేడు): గంజాయి విక్రయం కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో శనివారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను ఆయన వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తున్న ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన బడా లక్ష్మీనారాయణ, మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన జడా శ్రీహరి, అదే గ్రామానికి చెందిన మొగిలి వంశీ, ఉప్పు శివగోపిలను మండలంలోని వేంపాడు ఆంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్సై వై.నాగరాజు తన సిబ్బందితో అరెస్టు చేశారు. నిందితుడు లక్ష్మీనారాయణపై గతంలో మార్టూరు, చీరాలటౌన్, నరసరావుపేట 2 టౌన్ పోలీసుస్టేషన్లలో గంజాయి కేసులు నమోదయ్యాయని డీఎస్పీ తెలిపారు. ఉప్పు శివగోపిపై వేటపాలెం పోలీసుస్టేషన్‌లో గంజాయి కేసు, జడా శ్రీహరిపై మార్టూరు పోలీస్‌స్టేషనులో వివిధ కొట్లాట కేసుల నమోదైనట్లు తెలిపారు. తాజాగా ముద్దాయిలు అందరూ కలిసి కొంతకాలంగా సామర్లకోటకు చెందిన ఒక వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి బాపట్ల జిల్లాలోని మార్టూరు, ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వారికి తెలిసిన వ్యక్తుల ద్వారా గంజాయి అమ్ముతున్నారు. దర్శి సీఐ రామారావు, ముండ్లమూరు ఎస్సై నాగరాజులకు సమాచారం రావడంతో వారి కదలికలపై నిఘా పెట్టి శుక్రవారం ఈదరకు వచ్చి తిరిగి ఒంగోలు వెళ్తుండగా అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. వారి వద్ద 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దర్శి సీఐ రామారావు కేసు దర్యాప్తు చేపట్టి ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

సాక్షి ఎఫెక్ట్..

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని నూజిల్లపల్లి, అగ్రహారం గ్రామాల్లో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ బి.మధుశంకర్‌ల ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. 'సాక్షి'లో మంచంపట్టిన గ్రామాలు అన్న శీర్షికన ప్రచురించిన కథనానికి స్పందించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆయా గ్రామాలను శనివారం సందర్శించారు. మార్రెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నూజిల్లపల్లి, ఉమామహేశ్వరపురం గ్రామాలను ఆయన సందర్శించారు. పారిశుద్ధ్య పరిస్థితులను సమీక్షించారు. పశువులు ఉన్న స్థలాల్లో నీరు వెళ్లే మార్గాలను యాజమాన్యం ఏర్పాటు చేసుకోవాలని, అలా చూసే బాధ్యత గ్రామ కార్యదర్శులదేనన్నారు.



మురుగు నిల్వను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు

మొత్తం 42 మందికి చికిత్స చేశారు. ఇంటింటా సర్వే నిర్వహించి జ్వరపీడితులను గుర్తించారు. జిల్లా మలేరియా అధికారి మధుసూదనరావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి బసవారెడ్డి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని వేముల బండలో కంచుమాటి ఏడుకొండలు గృహాన్ని శనివారం దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సందర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా నిర్వాసితులైన ఏడుకొండలుకు మనోధైర్యం ఇచ్చి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట సుంకర బ్రహ్మానందరెడ్డి, రైతు విభాగం కన్వీనర్ బంకా నాగిరెడ్డి, పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సూదిదేవర అంజయ్య, చింతా శ్రీనివాసరెడ్డి, మేకల వెంకటేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, అప్పిరెడ్డి, అంబటి వెంకటేశ్వర రెడ్డి, డగ్లస్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

యర్రగొండపాలెం: తొలి స్వాతంత్ర్య సమర యోధుడు, బ్రిటీష్ పాలకులను గడ గడ లాడించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి సందర్భంగా రెడ్డి సంక్షేమ సేవా సంఘం శనివారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించింది. నరసింహారెడ్డి జయంతి నాటికి యర్రగొండపాలెంలో విగ్రహం ఏర్పాటు చేయాలని ఆ సంఘం తీర్మానించింది. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సేవా సంఘ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, శెనగ నారాయణరెడ్డి, నర్రెడ్డి వెంకటరెడ్డి, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, యర్ర లక్ష్మీరెడ్డి, గోపు వెంకటేశ్వరరెడ్డి, నారు నాసర్ రెడ్డి, గూడ వెంకటరెడ్డి, బత్తుల రామలింగారెడ్డి, తమ్మినేని యోగి వీరారెడ్డి, చిట్టి శ్రీనివాసరెడ్డి, మల్లెల బొర్రారెడ్డి, భూమిరెడ్డి చిన్న సుబ్బారెడ్డి, ఆవుల వెంకటరెడ్డి, మారంరెడ్డి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

సాగర్ కాలువలో దూకి యువకుడి ఆత్మహత్య

దర్శి (కురిచేడు): కురిచేడు రోడ్డులోని నాగార్జున సాగర్ కాలువలో దూకి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని నడింపల్లి గ్రామానికి చెందిన పుప్పాల వీరనారాయణ (17) ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సుకు క్లీనర్‌గా పనిచేస్తుంటాడు. అనారోగ్యంతో శనివారం స్థానిక వైద్యశాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి ఇంటికి వెళ్తూ సాగర్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మృతికి కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

బూచేపల్లి పరామర్శ..

పట్టణంలోని కురిచేడు రోడ్డు సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న పుప్పాల వీరనారాయణ కుటుంబ సభ్యులను సాగర్ కాలువ వద్ద దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. వీరనారాయణ అనారోగ్యానికి, ఆత్మహత్యకు కారణాలు కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



వీరనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎమ్మెల్యే పరామర్శ

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని వేంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు గండి మహేష్, గండి వీరయ్య, గండి అనిల్‌లు ప్రమాదంలో గాయపడ్డారు. వారిని దర్శి శాసనసభ్యుడు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆరోగ్యం కుదుట పడే వరకూ విశ్రాంతి తీసుకోవాలని క్షతగాత్రులకు ఎమ్మెల్యే బూచేపల్లి సూచించారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

ట్రాఫిక్‌తో అవస్థలు



ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు

- అరగంట పాటు నిలిచిన ఎమ్మెల్యే బూచేపల్లి కాన్వాయ్

కురిచేడు: నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో స్థానిక బస్టాండ్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం సాయంత్రం దర్శి శాసనసభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికి ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. సుమారు అరగంట పాటు ఆయన కాన్వాయ్ ట్రాఫిక్‌లో నిలిచిపోవాల్సి వచ్చింది. సుమారు పదేళ్ల క్రితం రోడ్డు వెడల్పు సందర్భంగా రోడ్డుపై అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించక పోవడంతో తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖలు తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనచోదకులు కురిచేడు వస్తుందంటే భయపడుతున్నారు. ఎన్నిసార్లు జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లయింది తప్ప చర్యలు శూన్యం. ఇప్పటికైనా జిల్లా అధికారులు, పాలకులు స్పందించి బస్టాండ్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సమ్మర్ స్టోరేజీలను పరిశీలించిన ఎస్‌ఈ



సాగర్ కాలువను పరిశీలిస్తున్న ఎస్‌ఈ బాలశంకరరావు

దొనకొండ: మండలంలోని చందవరం సమ్మర్ స్టోరేజీ 1, 2లను ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ డి.బాల శంకరరావు శనివారం పరిశీలించారు. నీటి సామర్థ్యం తగ్గకుండా స్టోరేజీ చేయాలని సిబ్బందికి సూచించారు. సమ్మర్ స్టోరేజీలో 85 శాతం నీరు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వేసవి దృష్టిలో పెట్టుకుని నీరు తగ్గకుండా సాగర్ జలాలను పంపింగ్ చేసి నీటి సామర్థ్యం పెంచాలన్నారు. సమస్యలుంటే తమకు తెలియజేయాలని ఏఈ కిరణ్‌కుమార్‌కు సూచించారు. ఆయన వెంట సీఈఓ చిరంజీవి, ఏఈ కిరణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



విద్యార్థుల డ్యాన్స్

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ మస్తాన్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు త్వరలో జరుగబోయే పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. ఎస్సై మహేష్, కళాశాల చైర్మన్ బట్టు సుధాకర్‌రెడ్డి, కరస్పాండెంట్ బట్టు రమణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫార్మర్ ఐడీ క్యాంపులు

దొనకొండ: గ్రామాల్లో ఫార్మర్ ఐడీలపై ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారయణ తెలిపారు. శనివారం కొచ్చెర్లకోట రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులతో ఏర్పాటు చేసిన క్యాంపులో ఆయన మాట్లాడారు. పొలం ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నామన్నారు. ఆధార్‌కు లింకైన ఫోన్ నంబర్‌కు 3 సార్లు ఓటీపీ వస్తుందని, వాటిని గ్రామ సిబ్బందికి చెప్పడంలో రైతులు సహకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్, రాయితీ విత్తనాలు, సున్నా వడ్డీ, పంట రుణాలకు విశిష్ట సంఖ్య తప్పని సరన్నారు. గ్రామాల్లోని రైతులు రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రదించాలన్నారు. ఎన్ని ప్రాంతాల్లో పొలం ఉన్నా ఎక్కడో ఒక చోట ఫార్మర్ ఐడీ చేయించుకుంటే సరిపోతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకుడు ఈశ్వరరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం

కురిచేడు: మండలంలో శివదీక్ష తీసుకున్న స్వాములు 40 మంది ఇరుముడులతో శ్రీశైలం శనివారం బయల్దేరారు. వారికి, వారి కోసం వచ్చిన బంధువులకు దాతలు, మాలధారణ స్వాములు కలిసి అన్నదానం స్థానిక శ్రీ జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో చేశారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై శివస్వాముల ఇరుముడి కార్యక్రమం తిలకించారు. అన్నదాన కార్యక్రమంలో భక్తులు స్వయంగా పాల్గొని సేవలు చేశారు.

శివస్వాములకు బూచేపల్లి అల్పాహారం



అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

కురిచేడు: మండలంలోని శివమాల దీక్ష చేసిన స్వాములు 40 మంది ఇరుముడులతో పాదయాత్ర ద్వారా శనివారం శ్రీశైలం బయల్దేరారు. దర్శి శాసన సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి వారిని సాదరంగా ప్రయాణానికి వీడ్కోలు పలికారు. పండ్లు, తాగునీటి బాటిళ్లు అందజేశారు. అనంతరం వారితో పాటు గ్రామ శివారు వరకు పాదయాత్ర చేసి వారికి మనోధైర్యాన్ని నింపారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వైపీ సుబ్బయ్య, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గోగులముడి లింగారెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడు మేరువ సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బుల్లం వెంకటనర్సయ్య, ఆవుల వెంకటరెడ్డి, పడమర వీరాయపాలెం, కురిచేడు సొసైటీ మాజీ అధ్యక్షులు ఊట్ల వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి నాగిరెడ్డి, పార్టీ సోషల్ మీడియా మాజీ ప్రచార కార్యదర్శి ఎన్వీ నాగిరెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి కోలా సంతోష్‌కుమార్, బయ్యవరం సర్పంచ్ మాలెపాటి నాగేశ్వరరావు, నాయకులు నుసుం సుబ్బారెడ్డి, కొలూరి నరసింహ, వెంకట నారాయణ, మాజీ జెడ్పీటీసీ వరికూటి వెంకటేశ్వర్లు, షేక్ మౌలాలీ, తేలుకుట్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.